క్లుప్తంగా

బీజామృతం తయారీపై అవగాహన

దొరవారిసత్రం : స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం పొదుపు మహిళలకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బీజామృతం తయారు చేసే విధానం, వినియోగంపై అవగాహన కల్పించారు. బీజామృతం ద్రవణం తయారీ కోసం ఆవు మూత్రం, ఆవు పేడ, సున్నం వంటివి తీసుకుని నీటిలో కలపడం, విత్తన శుద్ధి చేయడాన్ని వివరించారు. ఇలా విత్తన శుద్ధి చేసుకోవడం వలన భూమి నుంచి వచ్చే హానికరమైన జీవులు మృతిచెందుతాయన్నారు. మొలక శాతం బాగా పెరుగుతుందని తెలిపారు. వేరు నుంచి తెగుళ్ల నియంత్రించవచ్చన్నారు. అన్ని రకాల విత్తనాల శుద్ధికి బీజామృతం ఉపయోగపడుతుందని తెలిపారు.

కొనసాగుతున్న కోస్టల్ కారిడార్ సర్వే



సర్వే చేస్తున్న సర్వే బృందాల సభ్యులు

చిల్లకూరు : చెన్నై– బెంగళూరు కారిడార్‌కు ఏపీ ఐఐసీ ద్వారా కేటాయించిన తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను పక్కాగా సర్వే చేస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. భూముల సేకరణ పనుల్లో కొంత ఆలస్యం కావడంతో స్థానికంగా ఉండే రైతులు ఆ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. చెన్నై– బెంగళూరు కారిడార్ పనులు మొదలు పెట్టాలని భావించడంతో రైతులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామ సభలు నిర్వహించి 914 ఎకరాల భూమి సేకరించినట్టు అధికారులు రైతులకు తెలియజేశారు. ఈ భూముల్లో ఏయే పంటలు సాగు చేస్తున్నారు, ఎవరి ఆధీనంలో ఎంత భూమి ఉంది అన్న వివరాలను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. దీంతో నాలుగు సర్వే బృందాలు ఆ భూముల్లో సర్వే మొదలు పెట్టాయి. ప్రస్తుతం 250 ఎకరాల వరకు సర్వే పూర్తి చేసినట్లు సర్వే బృందాలు తెలిపాయి.

యాజమాన్య పద్ధతులతో నిమ్మలో అధిక దిగుబడి

దక్కిలి : నిమ్మసాగులో వేసవి సీజన్‌లో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చీనీ, నిమ్మ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు తెలిపారు. ఆయన శనివారం దగ్గవోలులో నిమ్మ తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిమ్మలో పూత రావడానికి జిబ్బరెల్లిక్ ఆమ్లం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే జిబ్బరెల్లిక్ ఆమ్లంను నీటిలో కలుపుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు తిరుపాల్, రాజీవణ, హెచ్‌వో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తడ: మండలంలోని కొండూరు సమీపంలో మాంబట్టు కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం ఎస్ఐ నరసింహారావు, పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. పత్రాలను పరిశీలించారు. అనుమతి లేని వస్తువులను రవాణా చేస్తున్నారా అని ఆరా తీశారు. మాంబట్టు సెజ్ పరిధిలోని పరిశ్రమల నుంచి వచ్చే ఆటోలు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి హెల్మెట్లు ధరించని, లైసెన్సులు లేని, అధిక లోడుతో ప్రయాణిస్తున్న వారికి జరిమానా విధించారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

వాకాడు : తమ గ్రామంలో కూలి పనులు లేక ఇబ్బంది పడుతున్నామని, ఉపాధి పనులు కల్పించాలని వాలమేడు గ్రామానికి చెందిన కూలీలు కోరారు. వారు శనివారం ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి పనులు జరగనివ్వకుండా కొందరు ఆటంకం కలిగిస్తున్నారని వాపోయారు. దీంతో తాము ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులు చేసుకుని ఉపాధి పొందవచ్చన్నారు. ఎవరైనా ఉపాధి పనులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

స్పేస్ సెంట్రల్ స్కూల్‌లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు

సూళ్లూరుపేట : పట్టణంలోని కేఆర్‌పీ కాలనీలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పేస్ సెంట్రల్ స్కూల్‌లో శనివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. శ్రీహరికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఆర్ భార్గవి ప్రతిభ చూపింది. 1500 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానం, త్రోబాల్ పోటీల్లో రన్నర్‌గా నిలిచింది. ఆమెను హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు, టీచర్లు అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్ : మండలంలోని ఎంపీ చక్కెర పరిశ్రమ సమీపంలో ఉన్న భగవతి మల్లికాంబ ఆలయంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు అమాస రామనారాయణ తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు కె.వెంకటరత్నం, ప్రవీణ్ యాదవ్, మునిరాజ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు.

వ్యాక్సిన్‌తో చర్మవ్యాధి నుంచి రక్షణ

దక్కిలి: పశువులకు వచ్చే ముద్ద చర్మవ్యాధి (లంపీ స్కిన్ డిసీజ్) పాల ఉత్పత్తిపై అధిక ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల చర్మంపై ముద్దలు, గడ్డలు ఏర్పడతాయి. ఈ వ్యాధి వల్ల పశువులు చాలా ఇబ్బంది పడతాయి. వీటి నివారణకు ఈ నెల 20 నుంచి పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ముద్ద చర్మ వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పశువులకు టీకాలు వేయించుకోవాలని దక్కిలి మండలం ఇన్‌చార్జి పశు వైద్యాధికారి కిషోర్ కుమార్ తెలిపారు.

వ్యాధి లక్షణాలు

- పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడుతాయి.
- పశువులకు అధిక జ్వరం వస్తుంది.
- పశువులు బలహీనంగా ,అలసటగా కనిపిస్తాయి.
- పశువులు ఆహారం తీసుకోకపోవడం లేదా తక్కువగా తీసుకుంటాయి.
- ముద్ద చర్మవ్యాధి సోకిన పశువులు తక్కువ పాలు ఇస్తాయి.

వ్యాధి వ్యాప్తి..

- ముద్దచర్మ వ్యాధి వైరస్ పశువుల నుంచి పశువులకు దోమలు, ఇతర కీటకాల ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి ఉన్న పశువులు నుంచి ఇతర పశువులకు వ్యాపిస్తుంది.
- నివారణ, చికిత్స: వ్యాక్సిన్‌తో ముద్దచర్మ వ్యాధి నివారణ సాధ్యమవుతుంది.



పశువులకు వైద్య పరీక్షలు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పశువుల నివాస ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి.
- పశువులకు దోమలు నుంచి రక్షణ కల్పించాలి
- పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయించాలి.
- ఏవైనా లక్షణాలు గమనిస్తే వెంటనే స్థానిక వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ చర్యలు

గోట్‌ఫాక్స్ వైరస్ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం అందిస్తోంది. ముద్ద చర్మవ్యాధి నివారణ కోసం వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సొసైటీల ద్వారా ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తోంది. అలాగే రైతులకు, పశువుల యజమానులకు ఈవ్యాధి నివారణ, చికిత్సపై అవగాహన కల్పిస్తోంది. ఈ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి.

ముద్ద చర్మవ్యాధి ప్రమాదకరం

ముద్ద చర్మవ్యాధి పశువులకు చాలా ప్రమాదకరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న గోట్ ఫాక్స్ వైరస్ వ్యాక్సిన్ వినియోగిస్తే ఈవ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతి రైతు పశు వైద్యాధికారుల సలహాలు పాటించి తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఈ నెల 20వ తేదీ నుంచి పశువుల కోసం ముద్ద చర్మ వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తున్నాం. – కిషోర్‌కుమార్, పశు వైద్యాధికారి



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం

ఓజిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులు ఆరోగ్యకరమని ఏడీవో భాస్కరయ్య తెలిపారు. మండలంలోని అత్తివరవం ఆర్బీకేలో శనివారం ప్రకృతి వ్యవసాయం కింద నేల, ప్రజల ఆరోగ్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు సాగుచేసే క్రమంలో రసాయన ఎరువులు, గుళికలు, కలుపు మందులు వాడడం వల్ల భూములు సారం కోల్పోతాయని తెలిపారు. దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. ఆ పంటలను తినడం వల్ల ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. స్థానికంగా లభించే సేంద్రియ ఎరువులు, కషాయాలు, జీవామృతం ఉపయోగించి పండించిన ఉత్పత్తులు ఎంతో ఆరోగ్యకరమన్నారు. మండలంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నామని వ్యవసాధికారిణి విజయలక్ష్మి తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వంశీ, తిరుమల, రైతులు చల్లా శ్రీధర్‌రెడ్డి, అనీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీవో భాస్కరయ్య

మేలుజాతి పశువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



దాణా అందజేస్తున్న అధికారులు

చిట్టమూరు(చిల్లకూరు) : పాడి రైతులు మేలుజాతి పశువులను అభివృద్ధి చేసుకోవడం ద్వారా అధిక పాల దిగుబడిని సాధించవచ్చని జిల్లా పశుగణాభివృద్ధి శాఖ డీడీ ఉమామహేశ్వరి తెలిపారు. చిట్టమూరు మండలం రామలింగాపురంలో శనివారం పాడి రైతులకు మేలుజాతి పశువుల పెంపకం, పెయ్య దూడల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్‌మిషన్ సౌజన్యంతో జిల్లా వ్యాప్తంగా మేలు జాతి పశువుల అభివృద్ధిపై రైతులకు అవగాహన కలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఒక్కొక్క పశువుకు రూ.1,350 ఇస్తుందని, దీంతో వీర్యనాళికలను తయారు చేసి ఉపయోగించుకోవచ్చన్నారు. అలాగే రెండు పర్యాయాలు పిండ మార్పిడి (ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ) గురించి అవగాహన కల్పించారు. అనంతరం 79 పశువులకు పరీక్షలు చేసి దాణా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం శ్రీనివాసరావు, డాక్టర్ ఏ రమణయ్య, డాక్టర్ సురేంద్ర, హేమాద్రి, రవి, సుప్రజ, హేమ, అమరావతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఓజిలి: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి చిన్నయ్య పేర్కొన్నారు. మండలంలోని పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగీ తదితర జ్వరాలు ప్రబలుతాయని తెలిపారు. తాగునీటి తొట్టెలు, కొబ్బరి చిప్పలు, పగిలిన టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో డెంగీపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈవో రాజగోపాల్, ఎంపీహెచ్‌ఎఫ్ఏ మల్లీశ్వరి, ఆశాకార్యకర్త సిద్ధమ్మ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

రాపూరు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గంగయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొంతమందికి ఆధార్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని తెలిపారు. అలాంటి వారి కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు సయీద్ మాట్లాడుతూ రాపూరు సాయి గిరిజన కాలనీలో చల్లా యానాదులకు ఆధార్ కార్డులు లేవన్నారు. అధికారులు వారికి అవగాహన కల్పించి పిల్లలకు ఆధార్ తీయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో చిన్న పిల్లలకు ఆధార్ లేకపోవడంతో పాఠశాలల్లో చేరలేకపోతున్నారని తెలిపారు. రాపూరు–నెల్లూరు రోడ్డులో బస్సులు సక్రమంగా లేవని పేర్కొన్నారు. బెంగళూరుకు అదనంగా మరో బస్సు నడపాలని కోరారు. వ్యవసాయాధికారి సోమసుందర్ మాట్లాడుతూ రైతులు పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. ఎంపీపీ ప్రసన్న, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రసన్న, వైస్ ఎంపీపీలు పెంచలరెడ్డి, వెంకటస్వామి, ఎంపీటీసీలు గౌరీ, బుజ్జిరెడ్డి, ఏపీవో సుబ్బరాయులు, వేపినాపి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, ఇరిగేషన్ ఏఈ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో గంగయ్య

వైభవంగా నృసింహుని కల్యాణం



స్వామి వారి కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు.

అధ్యాపకుడికి సన్మానం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని గురుకుల బాలుర జూనియర్ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు దుర్గాప్రసాద్‌ను శనివారం ప్రిన్సిపాల్ శారదాబాయ్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డులో ఆయన అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

పెళ్లకూరు: మండలంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి సమష్టిగా కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పెళ్లకూరులో గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి, ఎంపీడీవో అన్నపూర్ణారావు పాల్గొన్నారు.

డ్రోన్లతో వ్యవసాయం సులభతరం



డ్రోన్ వినియోగంపై డెమో చేసి చూపుతున్న వ్యవసాయాధికారులు

చిల్లకూరు : వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడం వల్ల ఖర్చులు తగ్గుతాయని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ఆయన శనివారం అన్నంబాక రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు వ్యవసాయ నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నేడు ఎక్కువ మంది నానో ఎరువులను వాడుతున్నారని తెలిపారు. గతంలో నానో యూరియా, పురుగు మందులను స్ప్రే చేసేందుకు రైతులు కూలీల కోసం ఇబ్బంది పడేవారని తెలిపారు. ఈ నేపథ్యంలో డ్రోన్లను వినియోగిస్తే ఖర్చు తక్కువ కావడంతోపాటు పని కూడా త్వరంగా అయిపోతుందన్నారు. సాగుకు ముందు భూమిలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకోవాలని, తద్వారా భూమి సార వంతం అవుతుందని వివరించారు. అనంతరం డ్రోన్ వినియోగంపై డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాల్, మండల ఏవో గూడూరు భవాని, గ్రామ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఘనంగా తాళ్లమ్మ కొలుపు

దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామ దేవత తాళ్లమ్మ కొలుపు మహోత్సవం రెండో రోజు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం తాళ్లమ్మ, పరుశురామయ్య, పెద్ద పోతురాజు, చిన్న పోతురాజుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. గొల్లలు వేసి వీరతాళ్లు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి సామూహిక పొంగళ్లు పెట్టనున్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

సైదాపురం: గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా జరిగేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ, ఎంపీడీవో సుధాకర్‌రావు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవో హైమావతి మాట్లాడుతూ మండలంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. పీఎం కిసాన్ పథకానికి అర్హులను ఎంపిక చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ చిత్తలూరు పోలయ్య, వైస్ ఎంపీపీలు ఈశ్వరమ్మ, భాస్కర్, పాలూరు ఈశ్వరరాజు, ఎంపీటీసీలు సుమతి, శిరసంబేటి పద్మమ్మ, నాగరాజు, ఏపీఎం రాధ పాల్గొన్నారు.

ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దాం

చిల్లకూరు : ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దామని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ పిలుపునిచ్చారు. మండలంలోని కడివేడు పంచాయతీ నేదురుమల్లి రాజ్యలక్ష్మీ గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లులు, బాలింతలకు బేటీ పడావో– బేటీ బచావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలకు సముచిత స్థానం ఇస్తామంటూనే ఆడ పిల్లలను పురిటిలోనే చంపేస్తున్నారని వాపోయారు. అలా చేయడం తగదన్నారు. ఇటీవల చిన్న పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా లైంగికదాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. బాల్య వివాహాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, చిల్లకూరు క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న సీడీపీవో, ఐసీడీఎస్ సిబ్బంది

మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం

సూళ్లూరుపేట : భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం మహోన్నత వ్యక్తి అని, ఆయన జీవితం భావితరాల వారికి స్ఫూర్తిదాయకమని సూళ్లూరుపేట సేవా సమాఖ్య ప్రతినిధి షేక్ ఉస్మాన్‌బాషా తెలిపారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం క్షిపణి శాస్త్రవేత్తగా చరిత్ర పుటల్లో నిలిచిపోయారని తెలిపారు. పేపర్ బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించి భారతదేశ ప్రథమ పౌరుడయ్యారని గుర్తు చేశారు. నిరాడంబరంగా జీవించి ఆదర్శమూర్తిగా నిలిచారని వివరించారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం చలపతి, ఇస్రో మాజీ ఉద్యోగి సురేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు సీఐ కౌన్సెలింగ్

వెంకటగిరి రూరల్ : బైక్‌లపై వెళుతూ అల్లరి చేస్తున్న ఆకతాయిలకు సీఐ సంగమేశ్వరరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. వెంకటగిరి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన కొందరు యువకులు బైక్‌ల్లో వేగంగా వెళుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కాలనీ వాసులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు లేఖ రాశారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కరించాలని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడికి ఫోన్‌లో ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో సీఐ సంగమేశ్వరరావు శనివారం ఎన్టీఆర్ కాలనీకి వెళ్లి యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



దక్కిలి: మండల కేంద్రమైన దక్కిలి కమ్మపల్లి రోడ్డు సెంటరు వద్ద శనివారం బైక్‌ను వ్యాన్ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. వెంగమనాయుడుపల్లికి చెందిన మోరా వెంకయ్య బైక్‌లో దక్కిలి నుంచి తెలుగు గంగ కాలువ మీదుగా ఇంటికి బయలుదేరాడు. కమ్మపల్లి రోడ్డు సెంటరు వద్ద వ్యాన్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకయ్యను స్థానికులు 108లో వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి తీసుకెళ్లారు. ఎస్ఐ చౌడయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సాక్షి ఎఫెక్ట్..

పెళ్లకూరు: స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు, రెవెన్యూ అధికారులు శనివారం చర్యలు తీసుకున్నారు. కలవకూరు వద్ద నదిలోకి వాహనాలు వెళ్లకుండా గోతులు తీయించారు. 'యథేచ్ఛగా ఇసుక దందా' శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లోని వ్యాపారులు, ట్రాక్టర్ యజమానులకు హెచ్చరికలు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్, వీఆర్వో వంశీ, వీఆర్ఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టచ్ టూల్ విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ


నాయుడుపేట టౌన్ : బోధనలో నూతన వరవడి సాధించడమే టచ్ టూల్ లక్ష్యమని తిరుపతి జిల్లా విద్యాశాఖ ఏఎంవో (అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి) ఎం.శివశంకర్ తెలిపారు. నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిది రోజులుగా ఉపాధ్యాయులకు టచ్ టూల్ విధానంపై ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఇందులో ఏఎంవో పాల్గొని మాట్లాడారు. నూతన విద్యావిధానంలో భాగంగా టచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు సహ ఉపాధ్యాయులకు టచ్ టూల్ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం టీచర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. గూడూరు డీవైఈవో శాంతి, నాయుడుపేట, ఓజిలి ఎంఈవోలు మునిరత్నం, చంద్రశేఖర్, చలంబాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

తడ: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని కారిజాత పంచాయతీ పాములమిట్టలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా పర్యావరణ క్లబ్ ఏర్పాటుతోపాటు అమ్మ పేరుతో మొక్కను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలలో ఎకో గ్రీన్ క్లబ్ ద్వారా పిల్లలతో మొక్కలు నాటించారు. నాటిన మొక్కలను వివిధ తరగతుల పిల్లలు దత్తత తీసుకుని సంరక్షించేలా మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ మునుస్వామి, హెచ్‌ఎం ఉస్మాన్ బాషా పాల్గొన్నారు.

చందనముడి పాఠశాలలో శిక్షా సప్తాహ్

దొరవారిసత్రం: మండలంలోని చందనముడి ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్‌ఎం శేషయ్య శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లల తల్లిదండ్రులతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు అందరూ కృషిచేయాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



దొరవారిసత్రం : పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం, గ్రామస్తులు



తడ: పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈవో

అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధుసూదనవర్మ తెలిపారు. హిస్టరీ, వ్యాయామ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. సంబందిత సబ్జెక్టులో పీజీతో పాటు ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు సర్టిఫికెట్‌ల జిరాక్స్ కాపీలతో ఈ నెల 31 తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

గాయపడిన యువకుడి మృతి

దొరవారిసత్రం : మండలంలోని వీఎస్‌ఆర్ నగర్ కాలనీ సమీపంలోని జాతీయ రహదారిపై బైక్ బోల్తా పడి తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. బూదూరుకు చెందిన బుడ్డతొట్టి వాసు(20) మూడు రోజుల క్రితం బైక్‌లో వెళుతూ అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : మేనకూరు వద్దనున్న హిందుస్థాన్ నేషనల్ గ్లాస్ పరిశ్రమ సమీపంలో ఈ నెల 18న జరిగిన ప్రమాదంలో గాయపడిన మరో యువకుడు ఎస్.తేజ(25) శనివారం తిరుపతి వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాయుడుపేట పట్టణం బేరిపేటకు చెందిన తేజ మేనకూరు సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అశోక్‌తో కలిసి 18న విధులకు వెళుతుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 18, 19 తేదీల్లో కర్నూలు ప్రాంతానికి చెందిన రామాంజనేయులు, దొరవారిసత్రం మండలం మైలాంగం గ్రామానికి చెందిన గుండా అశోక్ మృతి చెందిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతున్న తేజ మృతువాత పడ్డాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.